

ఉద్యోగాల పేరుతో ఖాకీ చీటింగ్

పోలీసు శాఖ, డాక్‌యార్డులో కొలువులంటూ నిరుద్యోగులకు బురిడీ

- సోదరుడితో కలిసి పలువురి నుంచి రూ.30 లక్షలకు పైగా వసూలు
- ఎంతకాలమైనా ఉద్యోగాలు రాకపోవడంతో నిలదీసిన బాధితులు
- డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో స్పందనలో ఫిర్యాదు
- జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన చోడవరం పోలీసులు
- విశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రధాన నిందితుడు -I లో

అమర్‌కు అవకాశం దక్కేనా?

పార్టీలో జోరుగా చర్చ

- ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గానికి మలసాల భరత్‌ను ఇన్‌చార్జిగా ప్రకటించిన అధిష్ఠానం
- చోడవరం, ఎలమంచిలి వైపు మంత్రి చూపు
- వ్యతిరేకించిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- స్వయంకృతాపరాధమేనంటున్న అనుచరవర్గం
- అనకాపల్లి నుంచి తప్పుకుంటానని సీఎంకు స్వయంగా ఆయనే చెప్పినట్టు ప్రచారం



గుడివాడ అమర్‌నాథ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కుతుందా?, లేదా?...అనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, దాదాపు అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని, ఒకటి, రెండు మార్పులతో ఆఖరి జాబితా త్వరలో విడుదల చేస్తామని అన్నారు. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో మంత్రి అమర్‌నాథ్‌కు ఇప్పటివరకూ ఏ నియోజకవర్గం కేటాయించలేదు. దాంతో ఆయన పరిస్థితి ఏమిటని ఆయన అనుచరవర్గం ఆందోళన చెందుతోంది. అంతా ఆయన స్వయంకృతాపరాధమేనని అంటోంది. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అమర్ నియోజకవర్గం (అనకాపల్లి)లో 'సొంత వర్గం' తయారుచేసుకున్నారు. ఇంకా భూముల వ్యవహారాలు, ఆర్‌ఈసీఎస్‌లో అడ్డగోలు నియామకాల్లో ఆయన పేరు వినిపించింది. ఇక తన శాఖల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు చేసిన మేలు ఏమీ లేకపోవడంతో పారిశ్రామిక వర్గాలు కూడా ఆయనకు ఆమడ దూరంలోనే ఉండిపోయాయి. పార్టీలో చిన్న పదవి వస్తే ఆ సామాజికవర్గం అంతా కలిసి భారీ సన్మానాలు చేయడం రివాజుగా మారింది. కానీ అమర్‌నాథ్‌కు మంత్రి పదవి వచ్చిన తరువాత తన సొంత సామాజికవర్గంలో నేటి వరకు ప్రత్యేకంగా గౌరవించి, సన్మానం చేయకపోవడం గమనార్హం. అధికారం చేపట్టగానే నోటికి వచ్చినట్టు మాట్లాడడమే అందుకు కారణమని ప్రచారం జరుగుతోంది.

ఇదిలావుండగా పార్టీలో అభ్యర్థుల ఖరారు ప్రక్రియ ప్రారంభం కాగానే పార్టీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అమర్ కలిసి...'తనకు అనకాపల్లి కాకుండా వేరే నియోజకవర్గం ఏదైనా కేటాయించండి' అని స్వయంగా కోరినట్టు సమాచారం. దీంతో పెందుర్తి, ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల నుంచి అమర్ పోటీ చేస్తే ఎలా ఉంటుంది?... అనే అంశంపై సర్వే చేయించారు. ఈ విషయం తెలిసి చోడవరం, ఎలమంచిలి ఎమ్మెల్యేలు గట్టిగా వ్యతిరేకించడంతో అమర్‌కు ఇప్పటివరకూ ఎక్కడా సీటు ఖరారు చేయలేదు.

మలసాలకు సిఫారసు

అనకాపల్లి నుంచి నువ్వు పోటీ చేయకపోతే ఎవరైతే బాగుంటుందో సూచించాలని సీఎం కోరినప్పుడు...అన్ని విధాలా తనకు విశ్వాసపాత్రుడిగా ఉండే మలసాల భరత్‌ని తీసుకువెళ్లి సీఎంకు పరిచయం చేశారు. దాంతో భరత్‌నే నియోజకవర్గ ఇన్‌చార్జిని చేశారు. అలా అనకాపల్లి నుంచి పోటీ చేసే అవకాశం పోయింది. ఇక ఎలమంచిలిలో తన కుటుంబాన్ని కాదని అమర్‌కు టికెట్ ఇస్తే...ఆయన ఓటమికే పనిచేస్తానని సిట్టింగ్ ఎమ్మెల్యే కన్నబాబురాజు అధిష్ఠానానికి చెప్పినట్టు ప్రచారం జరిగింది. దాంతో అక్కడ కూడా అవకాశం పోయింది. చోడవరంలో తనను తప్పించి ఎవరికి ఇచ్చినా ఓకే గానీ...అమర్‌కు ఇస్తే మాత్రం ఒప్పుకోనేది లేదని ధర్మశ్రీ పార్టీ పెద్దలకు చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన్ను అనకాపల్లి నుంచి ఎంపీగా బరిలో దింపడానికి అధిష్ఠానం ఆలోచన చేస్తున్నదంటూ అనుచరులు చెబుతున్నారు. మరోవైపు అనకాపల్లి ఎంపీ అభ్యర్థిత్వం కోసం సిట్టింగ్ ఎంపీ భీశెట్టి సత్యవతితో పాటు విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు కుమార్తె, ఎలమంచిలి ... మిగతా 6వ పేజీలో



జాతీయ రహదారిపై ఢీకొన్న లారీలు

జాతీయ రహదారిపై బీభత్సం

ఢీకొన్న లారీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై బుధవారం రాత్రి మూడు లారీలు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. హనుమంతువాక నుంచి వెంకోజీపాలెం వచ్చే మార్గంలో రాత్రి 10.30 గంటలకు ముందు వెళుతున్న కారును తప్పించే యత్నంలో ఓ టిప్పర్ డ్రైవర్ డివైడర్ దగ్గరకు వెళడంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న ట్యాంకర్...టిప్పర్‌ను ఢీకొంది. అదే సమయంలో దాని వెనుక వస్తున్న మరో కంటైనర్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కానప్పటికీ, ట్యాంకర్‌లోని ద్రావకం రోడ్డుపై పడడంతో వాహన చోదకులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదం జాతీయ రహదారిపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ముఖం చాటేసిన టెక్ మాంత్రిక్

'స్మైల్ ఆంధ్రా' పేరుతో రెండు రోజులుపాటు ఐటీ సదస్సు నిర్వహిస్తున్నట్టు హడావుడి

- రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.2 వేలు వసూలు
- అతిథులుగా నగర ప్రముఖులకు ఆహ్వానం
- ఆఖరి నిమిషంలో క్యాన్సిల్



విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఐటీ సదస్సుల పేరుతో హడావుడి చేసే బృందాలు పెరిగిపోతున్నాయి. రుషికొండలో ఐటీ కంపెనీ పెట్టి, ఉద్యోగాల పేరుతో డబ్బులు దండుకొని, పోలీస్ కేసులో ఇరుక్కున్న కంపెనీతో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ గత ఏడాది స్వర్ణ భారతి స్టేడియంలో ఓ సదస్సు నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా ఓ ఉన్నతాధికారి వెన్నుదన్నుగా ఉండి ఈ కార్యక్రమం నిర్వహించారు. తాజాగా మరో సంస్థ ఇంకో భారీ ప్రయత్నం చేసి...చివరి నిమిషంలో ముఖం చాటేసింది. ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో స్టార్టప్‌గా పనిచేసిన 'టెక్ మాంత్రిక్' అనే సంస్థ 'స్మైల్ ఆంధ్రా' పేరుతో ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు నిర్వహించడానికి నడుం కట్టింది. ఈ నెల 14, 15 తేదీల్లో ఈ సదస్సు నిర్వహణ కోసం సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాను బుక్ చేసింది. దీనికి 1,400 డెలిగేట్లు, 500 సంస్థలు, 100 స్టార్టప్‌లు, 100 ఎంఎస్ఎంఈలు, 60 మంది స్పీకర్లు, 50 మంది ఇన్వెస్టర్లు వస్తున్నారని, 30 సెషన్లు నిర్వహిస్తామని ప్రకటించింది. రిజిస్ట్రేషన్ రుసుము రూ.2 వేలుగా నిర్ణయించింది. దీనికి కేంద్ర ఐటీ శాఖ సహకారం అందిస్తున్నదని కరపత్రంలో ముద్రించింది. దాంతో పాటు ఏయూకు చెందిన ఆ హబ్, భాగవతుల చారిటబుల్ ట్రస్టు, ఇంకో రెండు సంస్థలు అండగా ఉన్నాయని ప్రచారం చేసుకుంది. ఐటీ రంగంలో ఎన్ని అంశాలు ఉన్నాయో అన్నింటిపైనా ఇక్కడ చర్చ జరుగుతుందని పేర్కొంది. ఏరోస్పేస్, డిఫెన్స్, డీప్ టెక్నాలజీస్, లాజిస్టిక్స్, పెట్రో కెమికల్స్, ఫార్మా, మెరైన్, టూరిజం, బ్లాక్‌చెయిన్, టెక్స్‌టైల్స్, హెల్త్, బయోటెక్, ఐఓటీ, స్మార్ట్ సిటీ, ఇండస్ట్రీ 4.ఓ., వెబ్ 3...ఇలా అన్నింటిపై చర్చిస్తామని, పెట్టుబడుల వరద పారిస్తామని ఊదరగొట్టింది. ఏయూ వీసీ, నగర పోలీస్ కమిషనర్, కలెక్టర్, ఇంకా ఇతర ప్రముఖులు దీనికి కీ స్పీకర్లుగా వస్తున్నారని ప్రకటించింది. ఈ సదస్సు బుధవారం ప్రారంభమై, గురువారం సాయంత్రం ముగియాలి. ఏమి జరిగిందో తెలియదు గానీ కార్యక్రమం నిర్వహించలేదు. బుధవారం చిల్డ్రన్ థియేటర్‌లో ఒక్కరూ లేరు. అనుమానం వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే అది డౌన్ చేసి ఉంది. అందులో 'వియ్ విల్ కమ్ బ్యాక్ సూన్' అని బోర్డు పెట్టేశారు. ఓ మంత్రి 'ఇప్పుడు ఈ కార్యక్రమం వద్దు' అన్నారని, అందుకే ఆపేశారని అంటున్నారు. అయితే ఆహ్వానించిన వారిలో చాలామంది పెద్దలు రావడానికి ఆసక్తి చూపకపోవడం, నిర్వాహకులకు అంత క్రెడిబులిటీ లేదని పెదవి విరిచేయడంతో కార్యక్రమం తుస్సుమంటుందనే కార్యక్రమం క్యాన్సిల్ చేసుకున్నారనే ప్రచారం కూడా ఉంది. వాస్తవానికి టెక్ మాంత్రిక్ పెద్ద కంపెనీ ఏమీ కాదు. కేవలం స్టార్టప్. వీరిని అడ్డం పెట్టుకొని వైసీపీ పెద్దలు విశాఖలో ఐటీ ఊగిపోతున్నదని ప్రచారం చేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి చాలామంది ఆసక్తి ప్రదర్శిస్తున్నారని ఎన్నికల ముందు షో చేయడానికి 'ఆడుదాం...ఆంధ్రా'లా 'స్మైల్ ఆంధ్రా' నిర్వహించాలనుకున్నారని చెబుతున్నారు. ఇదిలావుండగా రూ.2 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారి పరిస్థితి ఏమిటో ఎవరూ చెప్పలేకపోతున్నారు.

జాగా కనిపిస్తే పాగా

ఎనిమిదో వార్డులో వైసీపీ నేతల బరితెగింపు



హయగ్రీవ ప్రాజెక్టును అనుకుని ఉన్న కొండ ప్రాంతంలో చేపట్టిన అక్రమ నిర్మాణం

- ప్లాట్లుగా విభజించి అమ్మకం
- రెవెన్యూ, జీవీఎంసీ, సచివాలయ సిబ్బందికి వాటాలు



ఎండాడ యాత కాలనీ కొండపైన అమ్మకానికి సిద్ధమైన షెడ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14: 'పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నికల సమయంలో సొంత డబ్బులు ఖర్చు పెట్టాం. ఖర్చు పెట్టిన డబ్బులు తిరిగి రావాలంటే కొండైనా, బండైనా అవ్వుకోవల్సిందే'... అంటున్నారు జీవీఎంసీ ఎనిమిదో వార్డుకు చెందిన కొంతమంది వైసీపీ నాయకులు. ఆ వార్డు పరిధిలోని ఎండాడ బీసీ కాలనీ ప్రాంతం (యాత కాలనీ)లో ఒక కొండ ఉంది. దీనిని ఇప్పటికే కొంతమంది ఆక్రమించుకున్నారు. మిగిలిన దానిపై ఇప్పుడు స్థానిక వైసీపీ నాయకుల కన్నుపడింది. కొన్నిరోజుల క్రితం కొండను చదును చేసి షెడ్లు వేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు తొలగించారు. ఇటీవల మళ్లీ షెడ్లను పునర్నిర్మించేశారు. విద్యుత్ కనెక్షన్లు కూడా మంజూరుకావడంతో ప్రస్తుతం అమ్మకానికి సిద్ధం చేశారు.

మరో కొండ కబ్జా...

గొల్లల ఎండాడకు వెళ్లే మార్గంలో హయగ్రీవకు కేటాయించిన భూమిని ఆనుకుని ఉన్న కొండను సైతం స్థానిక వైసీపీ నేత కుటుంబసభ్యులు, అనుచరులు కబ్జా చేస్తున్నారు. గతంలో కొండపై కొంత ఆక్రమించుకున్నారు. పైన జీవీఎంసీకి మంచి నీటి ట్యాంకు ఉంది. ఇప్పుడు దానికి మార్గం వేస్తున్నారంటూ చదును చేయడం ప్రారంభించారు. అది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన భూమి అంటూ గతంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు కలిసి బోర్డు పెట్టారు. కానీ వైసీపీ నేత ఒకరు ఆ బోర్డును తొలగించేసి 60 గజాలు, 40 గజాల కింద ప్లాట్లు వేసి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు అమ్మకాలు జరుపుతున్నారు. ఎనిమిదో వార్డులో ప్రభుత్వ భూములు, కొండలు అన్యాక్రాంతమైపోతున్నాయి. కబ్జాదారులకు స్థానికంగా ఉండే అధికారులు, సచివాలయ ఉద్యోగులు సహకరిస్తూ వాటాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జల జీవన్ మిషన్ పనుల్లో ఇష్టారాజ్యం



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్

ప్రతిపాదనలకు భిన్నంగా పనులు

- నిధులు దుర్వినియోగం
- కాంట్రాక్టర్లపై లోపించిన అధికారుల పర్యవేక్షణ
- జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యుల ధ్వజం
- జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఏదీ
- అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టంకు లంచం అడుగుతున్నారని ఫిర్యాదులు
- ఏజెన్సీలోని చింతపల్లి, అరకులోయ ఆస్పత్రుల్లో డయాలసిస్ రోగులకు సేవలు అందించాలని డిమాండ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కొళాయిల ఏర్పాటు ద్వారా ఇంటింటికీ నీరు అందించే జలజీవన్ మిషన్ పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని జిల్లా పరిషత్ సభ్యులు ఆరోపించారు. పనుల చేపట్టిన కాంట్రాక్టర్లు, పర్యవేక్షించే అధికారుల్లో జవాబుదారీతనం లేదని ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. జలజీవన్ మిషన్ పనులపై చర్చను చైర్‌పర్సన్ ప్రారంభిస్తూ ఏజెన్సీలో చేపడుతున్న పనుల్లో నాణ్యతా లోపాలు ఉన్నాయన్నారు. టెండర్‌లో పొందుపరిచిన విధంగా కాకుండా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు దుర్వినియోగమం అవుతున్నాయన్నారు. చింతపల్లి జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల్లో నాణ్యత లేదన్నారు. హుకుంపేట, డుంబ్రిగుడ జడ్పీటీసీ సభ్యులు రేగా మత్స్యలింగం, చాట్రాయి జానకమ్మ మాట్లాడుతూ ప్రతిపాదనల్లో పేర్కొన్న మేరకు ఇంటింటికీ కొళాయిలు వేయడం లేదని, బోర్ల తవ్వకాల్లో కూడా అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం విఫలమైందని, మోటార్లు పనిచేయడం లేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా మంజూరుకావడం లేదన్నారు. రాంబిల్లి జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు మాట్లాడుతూ ఈ పథకంలో సొమ్ములు సరిపోవడం లేదని పంచాయతీల నుంచి కొంత మొత్తం తీసుకున్నారని చెప్పగా, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మాట్లాడుతూ ఇంటింటికీ కొళాయిల కోసం రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సభ్యుల ప్రశ్నలకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్.శివానందకుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఈఈ లీలాకృష్ణ వివరణ ఇస్తూ నిబంధనల మేరకు కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలో కమ్యూనిటీ కాంట్రాక్టు కమిటీలకు పనులు అప్పగించామన్నారు. జడ్పీ ... మిగతా 6వ పేజీలో

టికెట్ల కోసం కాంగ్రెస్‌లో పోటీ

విశాఖ పార్లమెంటు స్థానానికి ఇప్పటివరకూ 12 మంది దరఖాస్తు

- పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 68 మంది...
- 29వ తేదీ వరకూ అవకాశం



విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమా యత్తమవు తోంది. ప్రస్తుతం ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. 2014 ఎన్నికల్లో దరఖాస్తులను ఆహ్వానించినా ఆశించిన స్థాయిలో స్పందన లభించ లేదు. దాంతో అప్పటికే నియోజకవర్గాల్లో ఉన్న నాయకులకు అధిష్ఠానం సీట్లు ఇచ్చి పోటీ చేయించింది. కానీ, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో దిగేందుకు పోటీ నెలకొంది. ఒక్కో నియోజకవర్గం నుంచి పదుల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి.

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టిన తరువాత ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఇన్నాళ్లూ స్తబ్దుగా ఉన్నవారంతా క్రియాశీలకంగా మారారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. విశాఖ పార్లమెంటు స్థానంతోపాటు దాని పరిధిలోని అసెంబ్లీ స్థానాల అభ్యర్థిత్వం కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. పార్లమెంటు స్థానానికి ఇప్పటి వరకు 12 మంది దరఖాస్తు చేశారు. వీరిలో గంపా గోవింద్, వజ్జపర్తి శ్రీనివాస్, మహిళా విభాగం నాయకులు లక్ష్మి, గుత్తుల శ్రీనివాస్ ... మిగతా 6వ పేజీలో



డీఆర్వో సెక్షన్‌లోని సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలతో విధులకు ఉద్యోగులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని పలు శాఖల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. హక్కుల సాధన కోసం దశలవారీగా చేపడుతున్న ఆందోళనలో భాగంగా తొలిరోజు ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఏపీ జేఏసీ విశాఖ చైర్మన్ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఫెడరేషన్ సభ్యులు ఎన్జీవో హోమ్ నుంచి ఊరేగింపు నిర్వహించారు.



రైలు బయలుదేరే ముందు జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తున్న భక్తులు

అయోధ్యకు బయలుదేరిన రైలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14: అయోధ్యలో బాలరాముని దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఏర్పాటుచేసిన ప్రత్యేక రైలు బుధవారం రాత్రి పది గంటలకు 20 స్లీపర్ క్లాస్ కోచ్‌లతో విశాఖపట్నం నుంచి బయలుదేరింది. అలాగే ఈనెల 19, 28 తేదీల్లో కూడా అయోధ్యకు మరో రెండు రైళ్లు అందుబాటులో ఉంచనున్నట్టు తెలిసింది.

'తెలుగమ్మాయి- 2024' పోటీలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 14: అంతర్జాతీయ ఈవెంట్ దర్శకులు వీరుమామ ఆధ్వర్యంలో నాల్గో విడత తెలుగమ్మాయి -2024 పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారం పోస్టర్ రిలీజ్ చేశారు. ఈసారి కొత్తగా 11 నుంచి 34 ఏళ్ల వారుపాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. తెలుగువారు ఎలా బాపు బొమ్మలా ఉంటారో తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పాల్గొనేవారు 70137 35330 నెంబరుకు రెండు ఫొటోలు,వివరాలు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మజ,ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

డివైఈవోను రిలీవ్ చేయాలి: యూటీఎఫ్

సిరిపురం, ఫిబ్రవరి 14: జీవీఎంసీ విద్యా శాఖలో కొనసాగుతున్న డీవైఈవో డి.శ్రీనివాస్‌ను వెంటనే రిలీవ్ చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మను యూటీఎఫ్ ప్రతినిధులు కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాదిగా జీవీఎంసీ పరిధిలోని ఉపాధ్యాయులంతా జీవో 84 ప్రకారం పాఠశాల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలోకి వెళ్లారన్నారు. దీంతో సదరు డివైఈవోగా శ్రీనివాస్ ఏపని లేకుండా ఇక్కడ కొనసాగుతున్నారని వివరించారు. కమిషనర్ స్పందించి తగు చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ ప్రతినిధులు గొంది చిన్నబ్బాయి, టీఆర్ అంబేద్కర్, వి.శ్రీలక్ష్మీ, రాజునాయుడు, అర్జున్, అక్కునాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న జీవీఎంసీ ఉపాధ్యాయులు


రవీంద్రభారతి పాఠశాలలో అక్షరభ్యాసాలు


కాష్యప్ విద్యా నికేతన్‌లో ఏర్పాటుచేసిన సరస్వతి విగ్రహం

ఘనంగా వసంత పంచమి

» పాఠశాలల్లో సర్వతీ పూజలు
» చిన్నారులకు అక్షరాభ్యాసాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 14: ఎస్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పుస్తకాలను పూజలో పెట్టి ఉపాధ్యాయులకు ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎంవీ ధర్మారావు, ఎం ఎన్‌వీ విశ్వనాథం, కిశోర్, ఎ.సునంద్, రామలక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

విశ్వతేజ పాఠశాలలో...

తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జాతీయ పురస్కారం అందుకున్న వారిని సన్మానం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

వైభవంగా రాజశ్యామల చండీ యాగం

మురళీనగర్/ మర్రిపాలెం: ఉత్తర నియోజకవర్గంలోని పంజాబ్ హోటల్ జంక్షన్ సమీపాన నరసింహనగర్‌లో శ్రీ రాజ మాతంగీశ్వరి దేవి చతుర్దశి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రీ శ్యామలానందనాథ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో బుధవారం శ్రీ రాజశ్యామల దశ మహావిద్య చండీయాగం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. వసంత పంచమి పురస్కరించుకుని బాలలకు ఉచిత అక్షరాభ్యాసాలు నిర్వహించారు. గోపూజ, అమ్మవారి ఊరేగింపు, అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు జి.శ్రీనుబాబు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, రామయ్య ఉన్నారు. సోమవారం ఈ నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతాయని ట్రస్ట్ నిర్వాహకులు పేర్కొన్నారు.


రాజ్యలక్ష్మి యాగంలో పాల్గొన్న భక్తులు

సరస్వతీ పూజల సందడి

వసంత పంచమి సందర్భంగా మాధవధార లాన్సమ్ గ్రీన్స్ అపార్టుమెంట్ వద్ద సరస్వతీ దేవి ఆలయంలో శారదా దేవికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బాలలతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. రవీంద్ర భారతి పాఠశాలలో ప్రిన్సిపల్ గాయత్రి దేవి పర్యవేక్షణలో సరస్వతీ పూజలు చేశారు. సెక్టరు 8లో బాలభాను పాఠశాలలో వసంత పంచమి వేడుకలు జరిపారు.

100 మందికి అక్షరాభ్యాసాలు

డాబాగార్డెన్స్: అమ్మ జన్మనిస్తే.. అక్షరం జీవితాన్నిస్తుందని శ్రీ కాశ్యప్ విద్యానికేతన్ చైర్మన్ కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని శ్రీకాశ్యప్ విద్యానికేతన్‌లో సరస్వతిదేవి జయంతి పురస్కరించుకుని వసంత పంచమి నిర్వహించారు. సుమారు 100 మంది చిన్నారులకు ఉచితంగా అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు ఉన్నత విద్యను సాగించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతమ్మధార: ద్వారకానగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు.

కంచరపాలెం: వసంత పంచమి పర్వదినం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో గల పలు పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.అధిక సంఖ్యలో తల్లీదండ్రులు పాల్గొని తమ చిన్నారులచే అక్షరాలను దిద్దించారు.శ్రీ విద్యాటాలెంట్ స్కూల్,న్యూటన్,సూర్యభారతి,శ్రీ వాగ్దేవి,శారదా కాన్వెంట్ తదితర పాఠశాలల్లో అక్షరాభ్యాసం చేశారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

కనకమహాలక్ష్మి సన్నిధిలో పూజలు

జగదాంబ కూడలి: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆల యంలో వసంత పంచమి పురస్కరించుకుని సరస్వతీ దేవికి పూజలు ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదిమంది చిన్నారులకు అక్షరాభ్యా సాలు వేదపండింతుల సమక్షంలో జరిగాయి.


ఆలయ ఆవరణలో పూజలు

రేపటి నుంచి తెలుగుదండు పొలికేక ప్రజా ఉద్యమం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 14: తెలుగుదండు పొలికేక పేరిట ప్రత్యక్ష రాజకీయ పోరాటాన్ని ప్రారంభిస్తున్న తెలుగుదండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలుగుదండు పొలికేక పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 16న జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదటు 24 గంటల ఉపవాస దీక్షతో ఈ ప్రజాఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. నాటి నుంచి 60 రోజులు ఎన్నికలు ముగిసేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నా రు. ఇందులో భాగంగా ఒంటిపూట భోజనం, కాళ్లకు చెప్పులు లేకుండా నగరమంతా పర్యటిస్తామన్నారు. మాతృభాషను రక్షణే తమ ప్రధానమైన అంశమన్నారు. ఈ సమావేశంలో రాజమన్నార్, గంగరాజు, భానుకుమార్, గిరిబాబు, డీవీ సూర్యారావు, శంకర్‌నీ, జగత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తహసీల్దార్ కుటుంబానికి రూ. 2 లక్షల సాయం

మహరాణిపేట, ఫిబ్రవరి 14: ఇటీవల హత్యకు గురైన తహసీల్దారు రమణయ్య కుటుంబానికి విశాఖ, శ్రీకాకుళం జిల్లాల రెవెన్యూ సంఘాల పక్షాన తక్షణ సాయంగా రూ. 2లక్షలు ఏపీ రెవెన్యూ సర్వీస్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అందించారు. తహసీల్దార్ రమణయ్య కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. రమణయ్య భార్యకు ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరి ఉద్యోగం ప్రకటించినందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భూ ఆక్రమణలు, దీర్ఘకాలిక తగదా కేసులు పరిష్కారానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చే యాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల ధరలు పెరగడతో ఆక్రమణలు, ఇతర సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ క్రమంలో సమస్యాత్మకమండలాలను తక్షణమే గుర్తించి రక్షణ కల్పించాలని కల్పించాలని కలెక్టర్ ఏ మల్లికార్జునకు, పోలీసు కమిషనర్ ఏ రవిశంకర్‌కు వినతి పత్రాలను సమర్పించారు. పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రమిస్తున్న ఉద్యోగ సంఘు నేతలు

నాసా పోటీలకు ఎంపిక

సీతమ్మధార, ఫిబ్రవరి 14 : నేషనల్ ఎరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) పోటీలకు రవీంద్ర భారతి పాఠశాల ఎంపికైనట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ విద్యాసంస్థల చైర్మన్ ఎంఎస్ మణి తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని తమ పాఠశాలలకు చెందిన చిన్నారులు రూపొందించిన కృతిమ మేథ, పృథ్వీ, ఆర్ ఎర్త్ తదితర 14 ప్రాజెక్టులు ఎంపికైనట్టు ఆయన చెప్పారు. లాస్ ఏంజెల్స్‌లో మే నెల 23 నుంచి 26వ తేదీ వరకూ జరిగే అంతర్జాతీయ సమ్మేళనంలో ఈ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారన్నారు. విద్యార్థులను పాఠశాల నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌చార్జి ఎన్.వెంకేష్, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు

'వాడబలిజలకు టికెట్లు ఇవ్వాలి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 14: మత్స్యకార వాడ బలిజ కులస్తులకు రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధి మాద మహేష్ కోరారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా వాడ బలిజ కులస్తులు అధికంగా ఉన్నా విశాఖ దక్షిణ, పలాస నియోజకవర్గాల్లో త మకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో టికెట్లు ఇస్తే తమ వారిని గెలిపిస్తామన్నారు. ఉత్తరాంధ్ర మత్స్యకార ప్రతినిధి ఉమ్మిడి అప్పారావు మాట్లాడుతూ మత్స్యకారులను ఆదరించిన రాజకీయ పార్టీలకు వాడబలిజ కులస్తుల మద్దతు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మత్స్యకార ప్రతినిధులు కందుల పైడిరాజు, గరికిన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మత్స్యకార వాడ బలిజ ఐక్యవేదిక ప్రతినిధులు

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నీ


విజేతలతో అతిథి డాక్టర్ శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 14: జిల్లాస్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ బుధవారం ముగిసింది. సాగర్‌నగర్‌లోని టీటీ అకాడమీలో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర టే బుల్ టెన్నిస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ ముఖ్య అతిథిగా విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. టోర్నీ నిర్వాహకులు ఎస్.రామారావు, పి.శ్రీనివాసరావు, వి.ధనరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: అండర్-11 బాలుర విభాగంలో ఆర్యన్, సహిత్, బాలికల విభాగంలో పూజిత, జశ్మిత; అం డర్-13 బాలుర విభాగంలో మోక్ష, బాలాజీ, బాలికల కేటగిరిలో ఎస్‌కే అరిఫా, సెవిత శ్రీ; అండర్-15 బాలుర విభాగంలో టి.సాయిచరణ్, జాషువా, బాలికల కేటగిరిలో డి.దీక్షిత, జోస్నా విజయం సాధించారు. అండర్-19 బాలుర విభాగంలో మణికుమార్, మహిధర్, బాలికల కేటగిరిలో సన్విక, బి.జశ్మిత విన్నర్, రన్నరప్‌గా నిలిచారు.

సెంచరి క్లబ్‌పై ఆరోపణలు అవాస్తం

» క్లబ్ మాజీ అధ్యక్షుడు దిలీప్ కుమార్

మహరాణిపేట, ఫిబ్రవరి 14: సెంచరి క్లబ్‌పై సస్పెండయిన మాజీ సభ్యుడు శివాజీ చేసిన ఆరోపణలు అవాస్తవమని, అతనిని తొలగించామనే కక్ష్యతోనే ఇలా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఐబీపీ సెంచరి క్లబ్ సభ్యుడు, మాజీ అధ్యక్షుడు దిలీప్ కుమార్ తెలిపారు. బుధవారం మహారాణిపేటలోని క్లబ్ ఆవరణలో సంస్థ సభ్యులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంచరి క్లబ్ దక్షిణ దేశంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సంస్థ అని, దీనిని 1933లో ఏర్పాటు చేసి, సుమారు 90 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్నదన్నారు. ఎప్పుడూ ఏ విధమైన ఆరోపణలు లేవని, అనేక ఏళ్లగా నగరంలోని ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు రాజకీయ నాయకులు, ప్రముఖులు క్లబ్‌లో సభ్యులుగా ఉంటున్నారన్నారు. కె. శివాజీ, పి.వెంకటరమణలు ఇద్దరూ... క్రమ శిక్షణా రాహిత్యానికి పాల్పడటంతో సభ్యత్వాలను రద్దు చేశామని తెలిపారు. సమావేశంలో అధ్యక్షుడు వై. దుర్గాప్రసాద్, కార్యదర్శి జవహర్‌లాల్, పి. వెంకటరాజు, శ్రీమాన్ రామచంద్ర, మనోహర్, అనీల్‌బాబు, కిశోర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్లబ్ ప్రతినిధులు

గిరిజన గ్రామాల్లో వసతులు కల్పించాలి

» జడ్పీ ఆవరణలో గిరిజనుల వినూత్న నిరసన


డోలీ మోత, ఖాళీ పాత్రలతో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

మహరాణిపేట, ఫిబ్రవరి 14: గిరిజన గ్రామాలకు సాగు, తాగునీరు, కరెంటు, రహదారులు తదితర వసతులు కల్పించాలని కోరుతూ గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. జడ్పీకార్యాలయ ఆవరణలో బుధవా రం ఆదివాసీలు అడ్డాకులు ధరించి, కాగడాలు, డోలీ మోతలతో తమ నిరసనను వ్యక్తంచేశారు. అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ పరిధి బూరె, చినకోనల తదితర గ్రామాలకు రోడ్డు, కరెంటు సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోయారు. తమ భూములను స్థానిక రెవెన్యూ అధికారులు రియల్‌ఎస్టేట్ వ్యాపా రులతో కుమ్మక్కై గిరిజనేతరులకు నమోదు చేస్తున్నారని ఆ రోపించారు. తమ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెదకోట, పినకోట కివర్ల పంచాయతీ పరిధి 12 గిరిజన గ్రామాల ప్రజలు శ్రమదానంతో 13 కిలో మీటర్ల మేర రహదారి నిర్మించుకున్నట్టు చెప్పారు. ఆ గిరిజన ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు , కరెంటు సౌకర్యం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు యువకులు పాల్గొన్నారు.

'ఉత్తరం' ఇన్‌చార్జిగా 'పొలమరశెట్టి'ని నియమించాలి'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 14 : ఉత్తర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పార్టీ సీనియర్ నాయకుడు పొలమరశెట్టి శ్రీనివాస్‌ను నియమించాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును ఆయా వార్డుల అధ్యక్షులు, నాయకులు కోరారు. ఈ మేరకు గంటాకు బుధవారం నార్త్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, వార్డు అధ్యక్షులు కార్తీక్ కుట్టా, పొలమరశెట్టి శ్రీనివాస్, నాయకులు సంగువాసు, గారపాటి సతీష్ ఉన్నారు.

పలు రైళ్లు రద్దు...దారి మళ్లింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను మళ్లింపు మార్గం నడిపించనున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈనెల 26 నుంచి మార్చి 31 వరకు మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), కాకినాడ-విశాఖ పాసింజర్ (17269), విశాఖ-కాకినాడ పాసింజర్ (17268), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) రద్దు. అలాగే ఈనెల 27 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) రద్దు.

దారి మళ్లింపు

ఈనెల 26, 28, మార్చి 1, 2, 4, 6, 8, 9, 11, 13, 15, 16, 18, 20, 22, 23, 25, 27, 29, 30న ముంబాయి-కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), ఈనెల 26, మార్చి 4, 11, 18, 25న ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643), ఈనెల 28, మార్చి 1, 6, 8, 13, 15, 20, 22, 27, 29న బెంగుళూరు-గుహవటి ఎక్స్‌ప్రెస్ (12509) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి. ఇక ఈనెల 26, 31న ధనబాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351), ఈనెల 29, మార్చి 7, 14, 21, 28న టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111), ఈనెల 28, మార్చి 6, 13, 20, 27న జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376), ఈనెల 26, మార్చి 4, 11, 18, 25న హటియా-ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ (22837), మార్చి 2, 9, 16, 23, 30న హటియా-ఎంఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (18637), ఈనెల 27, మార్చి 3, 5, 10, 12, 17, 19, 24, 31న హటియా-ఎఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835), మార్చి 1, 8, 15, 22, 29న టాటానగర్-ఎస్‌ఎంవీ బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (12889) రైళ్లు వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి.

అమర్‌కు అవకాశం దక్కేనా?

... 5వ పేజీ తరువాయి

మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కూడా ప్రయత్నిస్తున్నారు.

నా గురించి జగన్ చూసుకుంటారు

టికెట్‌పై ఒకటి, రెండుసార్లు మంత్రి వద్ద విలేకరులు ప్రస్తావించగా...తన గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని సీఎం జగన్ చూసుకుంటారని, ఆయన ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని, లేదంటే పార్టీ కోసం పనిచేస్తానని, దేనికైనా సిద్ధమేనని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో వారం కిందట అమర్‌ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పార్టీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఆయనకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుందో, లేదో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

జల జీవన్ మిషన్ పనుల్లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

సీఈవో ఎం.పోలినాయుడు జోక్యం చేసుకని జల జీవన్ మిషన్ పనుల వివరాలను గ్రామాల వారీగా బోర్డులు ఏర్పాటుచేసి ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఆరు నెలలుగా జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు అందడం లేదని చింతపల్లి సభ్యుడు పోతురాజు బాలయ్య ఆవేదన వ్యక్తంచేయగా...గత ఏడాది జూలై, ఆగస్టు నెలల బిల్లులు అప్‌లోడ్ చేశామని, ఆ తరువాత నెలల బిల్లులు ఇంకా మంజూరు కాలేదని సీఈవో తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖపై పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు నిర్వహించిన రోగులకు కళ్లద్దాలు పంపిణీ పూర్తిగా జరగలేదని ప్రస్తావించగా అనకాపల్లి డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్ బదులిస్తూ దశల వారీగా అందజేస్తామన్నారు. మునగపాక జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సోమసత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించేందుకు లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించగా అందులో వాస్తవాలు ఉన్నాయని బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు పేర్కొనడంతో...చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేయగా, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటు, పాముకాటుకు వ్యాక్సిన్ వేయడానికి సూదులు కొరత ఉందని జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ పేర్కొన్నారు.

చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కొయ్యూరు, అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు వారా నూకరాజు, దేశరి గంగరాజు మాట్లాడుతూ కొందరు వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని ఫిర్యాదు చేశారు. అనంతగిరి నుంచి రోగులకు అత్యవసర వైద్యం కోసం నేరుగా విశాఖకు తీసుకురావడానికి అంబులెన్స్ ఇవ్వడం లేదని గంగరాజు ఆరోపించగా, సమస్యను పరిష్కరిస్తామని 108 కో-ఆర్డినేటర్ హామీ ఇచ్చారు. కొయ్యూరు మండలాధ్యక్షుడు బి.రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో డయాలసిస్ రోగులకు వైద్యం అందుబాటులో లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కొయ్యూరు నుంచి నర్సీపట్నం ఆస్పత్రికి వస్తే రిజిస్టర్ చేసుకున్న 25 రోజుల తరువాత డయాలసిస్ చేస్తున్నారన్నారు. ఆయనతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఇతర సభ్యులు ఏకీభవిస్తూ ఏజెన్సీలోని చింతపల్లి, అరకులోయ ఆస్పత్రుల్లో డయాలసిస్ సదుపాయం కల్పించాలని అధికారులను కోరారు. ఏజెన్సీలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, సకాలంలో వైద్యం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం ఆందోళన వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు తక్షణ సేవలు అందించే యంత్రాంగం ఏర్పాటుచేయాలన్నారు. దీనికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందిస్తూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు అంబులెన్స్ సిబ్బంది కొంత వరకు ప్రాథమిక చికిత్స చేస్తారని, తీవ్రంగా గాయపడితే వెంటనే ఆస్పత్రిలో చేర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏజెన్సీకి చెందిన పలువురు జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ ప్రమాదాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్, అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టికెట్ల కోసం కాంగ్రెస్‌లో పోటీ

... 5వ పేజీ తరువాయి

తదితరులు ఉన్నారు. ఇక తూర్పు నియోజకవర్గం టికెట్ కోసం ఎనిమిది మంది, 'పశ్చిమ' సీటు కోసం పది మంది, 'ఉత్తరం' కోసం పది మంది, 'గాజువాక'కు పది మంది, 'భీమిలి'కి 12 మంది, దక్షిణ నియోజకవర్గం నుంచి ఎనిమిది, ఎస్.కోట నుంచి పది మంది దరఖాస్తు చేసుకున్నారు. విశాఖ పార్లమెంటు, దాని పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు మొత్తం 80 దరఖాస్తులు అందాయి. ఈ నెల 29 వరకు గడువు ఉండడంతో ఈ సంఖ్య వంద దాటుతుందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 14: వన్‌టౌన్‌లోని చిలపేట, పద్మానగర్ ప్రాంతవాసులకుశెట్టి బలిజ క మ్యూనిటీ హాలులో వేదాంత గూడ్స్ కార్గో, ఎఫ్ఎక్స్‌బీ ఇండియా సురక్ష సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచితవైద్యశిబిరం నిర్వహించారు.వైద్య నిపుణులు 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులందజేశారు.వేదాంత సంస్థ సీఎఆర్ఎస్ మేనేజర్ సీఎస్ లక్ష్మి, ఎఫ్ఎక్స్‌బి సురక్ష ప్రాజెక్టు మేనేజర్ వై.అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. వైసీపీ నాయకురాలు కొల్లి సింహాచలం, కమ్యూనిటీ మొబలైజర్ జి.సునీత,డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.


వైద్య పరీక్షలుచేస్తున్న దృశ్యం

ట్రయథ్లాన్‌లో వంశీ కిరణ్‌కు కాంస్యం

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 14: ఇండియన్ నేవీ సర్వీసెస్ నిర్వహించిన జాతీయ స్థాయి ట్రయథ్లాన్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థి కాంస్య పతకం సాధించాడు. లోనవాలలో జరిగిన ఈ టోర్నీలో ట్రయిథ్లాన్ ఈవెంట్‌కు సంబంధించి ఒక కి.మి. స్విమ్మింగ్, 30 కి.మి. సైక్లింగ్, 10 కి.మీ రన్నింగ్‌లో వంశీ కృష్ణ ఈ పతకం సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కాలేజీ కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ వంశీకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణ రెడ్డి, గంగా భవాని పాల్గొని వంశీకృష్ణ ప్రతిభను కొనియాడారు.


వంశీని అభినందిస్తున్న ప్రతినిధులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ రైల్వే కాలనీలలోని చిల్డ్రన్స్ పార్కులో పూలు, పండ్ల మొక్కలను నాటారు. అక్కడి నివాసితులతో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పరిసరాల్లో మొక్కలు నాటాలని కోరారు. ప్రత్యేక అతిథిగా హాజరైన డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ కార్య క్రమాలను చేపడుతున్న ఈకార్వో ప్రతినిధులను ఈసందర్భంగా అభినందించారు. ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ఈకార్వో ప్రతినిధులు మధుమిత సాహు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న డీఆర్ఎం

కార్మిక సమ్మెకు సర్వం సిద్ధం



జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు స్టీల్‌ప్లాంట్‌లో రేపు నిర్వహణ

సమ్మె చేయవద్దంటూ కార్మిక నాయకులను కోరిన ఉక్కు యాజమాన్యం

సనేమిరా అన్న నేతలు


సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 14: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించరాదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, తదితర డిమాండ్లతో జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారం చేపట్టనున్న సమ్మెకు విశాఖ స్టీల్ ప్లాంట్ నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సిద్ధమయ్యారు. ప్లాంట్‌లో సుమారు పది వేల మంది శాశ్వత ఉద్యోగులు, 11 వేల మంది కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా కార్మిక సంఘాల నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించి కార్మికులకు సమ్మె చేసేందుకు గల కారణాలను వివరించి ఆందోళనలో పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు.


కార్మికుల డిమాండ్లు

- నూతన వేతనాలను అమలు చేయాలి
- జిందాల్‌తో చేసుకున్న ఎంవోయూను రద్దు చేసి సెయిల్‌లో ఉక్కును విలీనం చేయాలి
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేయాలి
- తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి
- నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలి
- ఉద్యోగులకు ఇంక్రిమెంట్ ఇవ్వాలి
- ఏ ఒక్క యూనిట్ ప్రైవేటీకరణ చేయరాదు
- వేతన ఎరియర్స్ ఇవ్వాలి
- అలవెన్స్‌లను ఇవ్వాలి

కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు

- స్టీల్‌ప్లాంట్‌లో సమాన పనికి సమాన వేతన చట్టాన్ని అమలు చేయాలి
- 18 వేల కనీస వేతనంతో పాటు వీడీఏ ఉండాలి
- కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా సవరించరాదు
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఉక్కు ప్రైవేటీకరణ, వ్యూహాత్మక అమ్మకాలను నిలిపివేయాలి
- కాంట్రాక్టర్లు చెల్లించని ఫుల్ అండ్ ఫైనల్‌ను యాజమాన్యం నేరుగా చెల్లించాలి
- ప్రమాద, అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుని కుటుంబంలో ఒక్కరికి ఉపాధి కల్పించాలి

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటాం



కార్మిక సమ్మె ద్వారా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తాం. జాతీయ సంఘాల పిలుపు మేరకు సమ్మె చేస్తున్నాం. ప్రైవేటీకరణ కాకుండా ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడమే మా ధ్యేయం. ఇందుకోసం ఎలాంటి త్యాగాలకైనా, పోరాటాలకైనా మేం సిద్ధం. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి సహకరించాలి.

-ఎం.త్రినాథం, ఉక్కు ఉద్యోగి

సమ్మెను విజయవంతం చేయాలంటూ పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 14: ఉక్కు కర్మాగారం కార్మికులకు నూతన వేతనాలను అమలు చేయాలని, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే వుంచాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 16న చేపట్టనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం కోరారు. ఈ మేరకు బుధవారం ప్లాంట్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. వేతన సవరణ అంశంపై కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైటీ దాసు, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, బాలశౌరి, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాలతో ఆర్‌ఎల్‌సీ, యాజమాన్యం భేటీ

స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె చేయడం వల్ల సాంకేతికపరమైన ఇబ్బందులు వస్తాయని, అందువల్ల సమ్మెను విరమించుకోవాలని కార్మిక సంఘాలకు రీజనల్ లేబర్ కమిషనర్, ఉక్కు అధికారులు విజ్ఞప్తి చేశారు. అయితే జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మె చేస్తామని, సంస్థకు ఎటువంటి నష్టం కలగకుండా ముందుకు సాగుతామని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

స్టీల్‌ప్లాంట్‌లో నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొననున్నందున యాజమాన్యం అప్రమత్తమైంది. ప్లాంట్‌లోని కీలక విభాగాల్లో కార్మికులు విధులు నిర్వహించకపోతే ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు భావించి అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కీలక విభాగాల్లో అధికారులు అప్రమత్తంగా వుండాలని, సమస్య ఏర్పడితే తక్షణమే స్పందించాలని ఉన్నతాధికారులు సూచించారు.

సమ్మెపై యాజమాన్యం ప్రత్యేక ఉత్తర్వులు

సమ్మెలో పాల్గొనే కార్మికులకు నో వర్క్-నో పే నిబంధన వర్తిస్తుందని యాజమాన్యం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. 1994లో యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సమ్మెలో పాల్గొనే ఉద్యోగులు ఉత్పత్తి ప్రోత్సాహకాలను కోల్పోతారని, కంపెనీ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం సమ్మెలో పాల్గొనే ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే హక్కు యాజమాన్యానికి ఉందని పేర్కొంది. సమ్మె కాలంలో రవాణా, క్యాంటీన్ సౌకర్యాలకు అంతరాయం వాటిల్లే అవకాశం ఉన్నందున ఉద్యోగులంతా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని యాజమాన్యం సూచించింది. అదేవిధంగా కర్మాగారంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా అనుకోని సంఘటన జరిగితే తక్షణమే స్పందించే విధంగా నిరంతరం ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. ముఖ్యంగా గ్యాస్, ఫర్నేస్, ఎస్‌ఎంఎస్‌ల వద్ద పటిష్ఠ భద్రతను చేపడుతున్నారు.

టీడీపీ గెలుపు రాష్ట్రానికి అవసరం

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు

ఆర్పీపేట (కంచరపాలెం), ఫిబ్రవరి 14: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడం రాష్ట్రానికి అత్యవసరమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 56వ వార్డు పరిధి చాకలిగెడ్డలో బుధవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ భయాందోళనతో జీవనం సాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవడం ద్వారా ప్రజలందరికీ మంచిరోజులు వస్తాయన్నారు. 'భవిష్యత్తుకు గ్యారంటీ' ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలందరికీ భరోసా కల్పించే బాధ్యతను చంద్రబాబు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, నాయకులు జీవా, జోగినాయుడు, మళ్ల శంకరరావు, కె.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకున్న గ్రామ పెద్దలు

మల్కాపురం, ఫిబ్రవరి 14: మల్కాపురం గ్రామకంఠ స్థలంలో ఆటో స్టాండ్ నిర్మాణానికి చేస్తున్న యత్నాలను మల్కాపురం గ్రామ కమిటీ పెద్దలు అడ్డుకున్నారు. మల్కాపురంలోని ప్రకాశ్‌నగర్ ఏడు గుళ్ల జంక్షన్ వద్ద కొంత స్థలం ఖాళీగా ఉంది. స్థానికంగా ఉన్న కొంతమంది ఆటోడ్రైవర్లు ఆటో స్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు పలువురు ప్రతినిధులతో ఆటో స్టాండ్ నిర్మాణ పనులు జరగకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇప్పటికే పలుచోట్ల గ్రామకంఠ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, ఇకపై ఎవరైనా ఆక్రమణకు యత్నిస్తే సహించబోమన్నారు.

కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌ల నిర్వీర్యం తగదు

అగనంపూడి, ఫిబ్రవరి 14: కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లను ఉక్కు యాజమాన్యం నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించడం తగదని టీఎన్‌టీయూసీ నేతలు పేర్కొన్నారు. బుధవారం కొండయ్యవలసలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మానసిక ఉల్లాసానికి, గ్రంథాలయ పఠన కోసం ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లను ఏర్పాటు చేశారన్నారు. వీటి నిర్వహణకు ఉద్యోగుల జీతాల్లో రూ.20తోపాటు యాజమాన్యం కూడా కొంత మొత్తం ఇచ్చేదన్నారు. ప్రస్తుతం వీటి నిర్వహణ కోసం యాజమాన్యం పట్టించుకోవడం లేదని, కేవలం ఈ కేంద్రాలను మూత కోసమే ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. ఉక్కు యాజమాన్యం యథావిధిగా కమ్యూనిటీ వెల్ఫేర్ కేంద్రాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, శీరంశెట్టి బాబీ, విందుల వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల రక్షణకు పిడికిలి బిగించాలి

మల్కాపురం, ఫిబ్రవరి 14: కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కార్మికులంతా పిడికిలి బిగించి ఈ నెల 16న జరగనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయంతం చేయాలని ఇంటక్, సీఐటీయూసీ, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. హెచ్‌పీసీఎల్-సీ గేటు వద్ద బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులందరూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతుల విధానాలకు వ్యతిరేకంగా చర్యలు చేపడుతుండడం దారుణమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోగా.. నిత్యావసర సరకుల ధరలను ఇష్టానుసారంగా పెంచుతూ ప్రజల నెత్తిన పెనుభారం మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు కె.పెంటారావు, భోగవిల్లి నాగభూషణం, నక్కా లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, పైడిరాజు, పి.సురేశ్, నరేశ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలపై భెల్ కార్మికుల నిరసన

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం బెల్ హెచ్‌పీవీపీ అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కర్మాగారం మెయిన్ గేటు వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ బెల్ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతు నష్టాల పేరుతో ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించి, కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్రం ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. 16న జరిగే కార్మిక సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి బాబూరావు, పీవీఎస్ రాజు, కొల్లి దేముడు, బి.బాబూరావు, ఎస్.జగన్నాథరావు, వి.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన


శిబిరంలో పాల్గొన్న వైద్యులు, జనసేన నాయకులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 14: ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. వడ్లపూడిలో జనసేన, శ్రీవైభవ్‌జ్యోతి చారిటబుల్ ట్రస్ట్, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కేన్సర్ ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందన్నారు. అనంతరం సుమారు 200 మంది మహిళలకు కేన్సర్‌కు సంబంధించి వివిధ రకాల పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు సిరసపల్లి కనకరాజు, ఇందిరా ప్రియదర్శిని, డి.జ్యోతిరెడ్డి, లంకల మురళీదేవి, నర్సింగ్, జి.అప్పారావు, గంధం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

విశాఖలో 25 పడకల ఆర్టీసీ ఆస్పత్రిని నిర్మించాలి

ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 14: ఉత్తరాంధ్రకు కేంద్ర బిందువైన విశాఖలో 25 పడకల ఆర్టీసీ ఆస్పత్రిని నిర్మించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. బుధవారం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో జరిగిన ఈయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి విశాఖకు ఆన్ డ్యూటీలో ఎంతోమంది సిబ్బంది రాకపోకలు సాగిస్తుంటారని, వారందరికీ అత్యవసర సమయాల్లో వైద్య సేవలందించేందుకు ఈ ఆస్పత్రి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అందువల్ల త్వరితగతిన ఆస్పత్రిని నిర్మించాలని ఇప్పటికే ఏపీపీటీడీ ఎంప్లాయిస్ తరఫున సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావుకు విజ్ఞప్తి చేశామన్నారు. అన్ని డిస్పెన్సరీలలో అధునాతన సౌకర్యాలను అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి, విజయ నగరం జోన్ జోనల్ అధ్యక్షుడు శుభకర్, విశాఖ జిల్లా ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి, కె.శ్రీనివాసరావు, డిపో నాయకులు గోపాల్, రాము, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఈగెల్ :** జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శరత్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఈగెల్ :** మెలోడి, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం),
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** సంగం, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 19, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 44, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 24, దొండకాయలు 34, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 115
ఫారం ధర	-- 135
విత్ స్కిన్	-- 240
స్కిన్‌లెస్	-- 250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


గాజువాకలో పొగమంచు


ఎల్‌పీనగర్‌లో..

గాజువాకను కప్పేసిన మంచు దుప్పటి

ఉదయం 8 గంటల వరకు హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించిన వాహనదారులు

గాజువాక, ఫిబ్రవరి 14: గాజువాక పరిసర ప్రాంతాలను బుధవారం వేకువజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో వేకువజామున విధులకు హాజరయ్యే పలు పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులతో పాటు వాకింగ్‌కు వెళ్లిన వారంతా ఇబ్బందులు పడ్డారు. రహదారులను మంచు దుప్పటి కప్పేయడంతో వాహన చోదకులకు ఎదురుగా వచ్చే ఇతర వెహికల్స్ కనిపించకపోవడంతో ఇక్కట్లకు గురయ్యారు. దీంతో వాహనదారులందరూ హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. ఉదయం ఎనిమిది గంటలు దాటినా పొగమంచు వీడలేదు. అయితే చాలాకాలం తర్వాత గాజువాక పరిసరాల్లో పొగమంచు కురవడంతో పలువురు ఫొటోలు తీసుకోవడంతో పాటు సెల్ఫీలు దిగారు.

ఆటోనగర్: పారిశ్రామిక ప్రాంతంలోని ఆటోనగర్, ఎల్‌వీనగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఏజెన్సీలోని లంబసింగి, అరకులోయ ప్రాంతాలను తలపించేలా మంచు కమ్మేసి సుందర దృశ్యాలను ఆవిష్కరించిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. దట్టమైన పొగమంచు కమ్మేయడంతో వాహనదారులందరూ ఉదయం ఎనిమిది గంటలు దాటినప్పటికీ ఎదురుగా వచ్చే వెహికల్స్ కనిపించక హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించడం కనిపించింది.

పలుచోట్ల వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

గోపాలపట్నం, ఫిబ్రవరి 14: ఇక్కిడి కొత్తపాలెం గ్రామంలో కొలువుదీరిన విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలు చేపట్టారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాటు చేశారు. సాయంత్రం జరిగిన తీర్థంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ముత్యమాంబ ఆలయంలో..

నరవ గ్రామంలో ముత్యమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున అమ్మవారికి విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి సారెను, ఆభరణాలను గ్రామంలో ఊరేగించాక ముత్యమాంబను శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

నడుపూరులో..

పెదగంట్యాడ: నడుపూరులోని సంకట విమోచన గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం బుద్ధి సిద్ధి, వినాయకస్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. ఆ తర్వాత తిరువీధి ఉత్సవాన్ని చేపట్టారు. నడుపూరు, రామచంద్రానగర్, రిక్షా కాలనీ, సీతానగరం ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

ఎన్.ఎ.డి. జంక్షన్, ఫిబ్రవరి 14: జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం పరిసర 16 గ్రామాల ఆరాధ్య దైవం పైడిమాంబ పండగలో భాగంగా రెండో రోజైన బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో మంగళవారం రాత్రి జరగాల్సిన సాంస్కృతిక ప్రదర్శనలు వాయిదా పడిన సంగతి తెలిసిందే.

ఆటోనగర్: జీవీఎంసీ 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలో సత్తెమ్మ తల్లి పండగను ఘనంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యే పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.


శారదాపీఠం ఆవరణలో చిన్నారులతో తల్లిదండ్రులు

శారదా పీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు

పెందుర్తి, ఫిబ్రవరి 14: చినముషిడివాడలోని శారదా పీఠంలో బుధవారం వసంత పంచమి వేడుకలను పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో పీఠం శ్రీకార్యం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా పీఠం ప్రాంగణంలో అధిష్ఠాన దేవత రాజశ్యామల స్వరూప శారదామాత సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలను చేపట్టారు. సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులకు అమ్మవారి చెంత ఉంచి పూజించిన పెన్నులు, నోటు పుస్తకాలను అందించారు. అలాగే శారదాపీఠంలో నేమాని కుటుంబీకులకు చెందిన డిజిటల్ పంచాంగాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో..

ఉక్కుటౌన్‌షిప్: వసంత పంచమి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలోని సరస్వతీదేవికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన తల్లిదండ్రులు, చిన్నారులతో ఆలయ పరిసర ప్రాంతాలు కళకళలాడాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

త్రివర్ణ పతాకంతో ర్యాలీ

గాజువాక, ఫిబ్రవరి 14: పుల్వామా ఉగ్రమూకల దాడిలో వీరమరణం పొందిన సైనికులకు జైభారత్ అసోసియేషన్ ప్రతినిధులు నివాళులర్పించారు. పుల్వామా దాడి జరిగి ఐదేళ్లవుతున్న క్రమంలో అమరులకు నివాళులర్పిస్తూ త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈరోజు ప్రేమికుల దినోత్సవం కాదని, బ్లాక్ డే అని పలువురు పేర్కొన్నారు. ప్రతినిధులు రమేశ్, షేక్ సుభాన్, కిషోర్, శ్రీనివాస్, శర్మ, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 14: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి గ్రామస్థుల ఆరాధ్య దైవం పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, పురవీధుల్లో సారె ఊరేగింపు, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం తీర్థం జరుపుతామని కమిటీ ప్రతినిధి సన్యాసి అప్పారావు తెలిపారు.


లబ్ధిదారులకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న దృశ్యం

ప్రజా సంక్షేమమే కేంద్రం ధ్యేయం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర

గాజువాక, ఫిబ్రవరి 14: ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. గాజువాకలో బీజేపీ నూతన కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను కేంద్రం అందిస్తుందన్నారు. అయితే కేంద్ర పథకాలను రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గాజువాకలో బీజేపీ జెండా ఎగరవేయాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రామ్మోహన్, గూటూరు శంకరరావు, దీనంకొండ కృష్ణంరాజు, సోంబాబు, యల్లాజీరావు, భువనేశ్వరి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాలయం ప్రారంభం

పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 14: పురుషోత్తపురం బీఆర్టీఎస్ రహదారి సమీపంలో ఎంతో ఆకర్షణీయంగా నిర్మించిన శ్రీకృష్ణాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠాపన, పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. కేరళ కళాకారుల వాయిద్యాలు, చిడతలు, సాముగారడీలు, తప్పెటగుళ్లు, శ్రీకృష్ణుని నామ స్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. కార్యక్రమంలో మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే ఎ.అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేవుడు, చందు యాదవ్, పి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'తెలుగమ్మాయి- 2024' పోటీలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 14: అంతర్జాతీయ ఈవెంట్ దర్శకులు వీరుమామ ఆధ్వర్యంలో నాల్గో విడత తెలుగమ్మాయి -2024 పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారం పోస్టర్ రిలీజ్ చేశారు. ఈసారి కొత్తగా 11 నుంచి 34 ఏళ్ల వారుపాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. తెలుగువారు ఎలా బాపు బొమ్మలా ఉంటారో తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పాల్గొనేవారు 70137 35330 నెంబరుకు రెండు ఫొటోలు,వివరాలు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మజ,ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

డివైఈవోను రిలీవ్ చేయాలి: యూటీఎఫ్

సిరిపురం, ఫిబ్రవరి 14: జీవీఎంసీ విద్యాశాఖలో కొనసాగుతున్న డీవైఈవో డి.శ్రీనివాస్‌ను వెంటనే రిలీవ్ చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మను యూటీఎఫ్ ప్రతినిధులు కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాదిగా జీవీఎంసీ పరిధిలోని ఉపాధ్యాయులంతా జీవో 84 ప్రకారం పాఠశాల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలోకి వెళ్లారన్నారు. దీంతో సదరు డివైఈవోగా శ్రీనివాస్ ఏపని లేకుండా ఇక్కడ కొనసాగుతున్నారని వివరించారు. కమిషనర్ స్పందించి తగు చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ ప్రతినిధులు గొంది చిన్నబ్బాయి, టీఆర్ అంబేద్కర్, వి.శ్రీలక్ష్మీ, రాజునాయుడు, అర్జున్, అక్కునాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న జీవీఎంసీ ఉపాధ్యాయులు


రవీంద్రభారతి పాఠశాలలో అక్షరభ్యాసాలు


కాశ్యప్ విద్యా నికేతన్‌లో ఏర్పాటుచేసిన సరస్వతి విగ్రహం

ఘనంగా వసంత పంచమి

- పాఠశాలల్లో సర్వతీ పూజలు
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 14: ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పుస్తకాలను పూజలో పెట్టి ఉపాధ్యాయులకు ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎంవీ ధర్మారావు, ఎం ఎస్‌వీ విశ్వనాథం, కిశోర్, ఎ.సునంద్, రామలక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

విశ్వతేజ పాఠశాలలో...

తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జాతీయ పురస్కారం అందుకున్న వారిని సన్మానం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

వైభవంగా రాజశ్యామల చండీ యాగం

మురళీనగర్/ మర్రిపాలెం: ఉత్తర నియోజకవర్గంలోని పంజాబ్ హోటల్ జంక్షన్ సమీపాన నరసింహనగర్‌లో శ్రీ రాజ మాతంగీశ్వరి దేవి చతుర్దశి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రీ శ్యామలానందనాథ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో బుధవారం శ్రీ రాజశ్యామల దశ మహావిద్య చండీయాగం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. వసంత పంచమి పురస్కరించుకుని బాలలకు ఉచిత అక్షరాభ్యాసాలు నిర్వహించారు. గోపూజ, అమ్మవారి ఊరేగింపు, అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు జి.శ్రీనుబాబు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, రామయ్య ఉన్నారు. సోమవారం ఈ నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతాయని ట్రస్ట్ నిర్వాహకులు పేర్కొన్నారు.


రాజ్యలక్ష్మి యాగంలో పాల్గొన్న భక్తులు

సరస్వతీ పూజల సందడి

వసంత పంచమి సందర్భంగా మాధవధార లాన్సమ్ గ్రీన్స్ అపార్టుమెంట్ వద్ద సరస్వతీ దేవి ఆలయంలో శారదా దేవికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బాలలతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. రవీంద్ర భారతి పాఠశాలలో ప్రిన్సిపల్ గాయత్రి దేవి పర్యవేక్షణలో సరస్వతీ పూజలు చేశారు. సెక్టరు 8లో బాలభాను పాఠశాలలో వసంత పంచమి వేడుకలు జరిపారు.

100 మందికి అక్షరాభ్యాసాలు

డాబాగార్డెన్స్: అమ్మ జన్మనిస్తే.. అక్షరం జీవితాన్నిస్తుందని శ్రీ కాశ్యప్ విద్యానికేతన్ చైర్మన్ కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని శ్రీకాశ్యప్ విద్యానికేతన్‌లో సరస్వతిదేవి జయంతి పురస్కరించుకుని వసంత పంచమి నిర్వహించారు. సుమారు 100 మంది చిన్నారులకు ఉచితంగా అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు ఉన్నత విద్యను సాగించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతమ్మధార: ద్వారకానగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు.

కంచరపాలెం: వసంత పంచమి పర్వదినం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో గల పలు పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.అధిక సంఖ్యలో తల్లీదండ్రులు పాల్గొని తమ చిన్నారులచే అక్షరాలను దిద్దించారు.శ్రీ విద్యాటాలెంట్ స్కూల్,న్యూటన్,సూర్యభారతి,శ్రీ వాగ్దేవి,శారదా కాన్వెంట్ తదితర పాఠశాలల్లో అక్షరాభ్యాసం చేశారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

కనకమహాలక్ష్మి సన్నిధిలో పూజలు

జగదాంబ కూడలి: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆల యంలో వసంత పంచమి పురస్కరించుకుని సరస్వతీ దేవికి పూజలు ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదిమంది చిన్నారులకు అక్షరాభ్యా సాలు వేదపండింతుల సమక్షంలో జరిగాయి.


ఆలయ ఆవరణలో పూజలు

రేపటి నుంచి తెలుగుదండు పాలికేక ప్రజా ఉద్యమం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 14: తెలుగుదండు పొలికేక పేరిట ప్రత్యక్ష రాజకీయ పోరాటాన్ని ప్రారంభిస్తున్న తెలుగుదండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలుగుదండు పొలికేక పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 16న జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదటు 24 గంటల ఉపవాస దీక్షతో ఈ ప్రజాఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. నాటి నుంచి 60 రోజులు ఎన్నికలు ముగిసేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నా రు. ఇందులో భాగంగా ఒంటిపూట భోజనం, కాళ్లకు చెప్పులు లేకుండా నగరమంతా పర్యటిస్తామన్నారు. మాతృభాషను రక్షణే తమ ప్రధానమైన అంశమన్నారు. ఈ సమావేశంలో రాజమన్నార్, గంగరాజు, భానుకుమార్, గిరిబాబు, డీవీ సూర్యారావు, శంకర్‌నీ, జగత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తహసీల్దార్ కుటుంబానికి రూ. 2 లక్షల సాయం

మహారాణిపేట, ఫిబ్రవరి 14: ఇటీవల హత్యకు గురైన తహసీల్దారు రమణయ్య కుటుంబానికి విశాఖ, శ్రీకాకుళం జిల్లాల రెవెన్యూ సంఘాల పక్షాన తక్షణ సాయంగా రూ. 2లక్షలు ఏపీ రెవెన్యూ సర్వీస్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అందించారు. తహసీల్దార్ రమణయ్య కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. రమణయ్య భార్యకు ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరి ఉద్యోగం ప్రకటించినందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భూ ఆక్రమణలు, దీర్ఘకాలిక తగదా కేసులు పరిష్కారానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చే యాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల ధరలు పెరగడతో ఆక్రమణలు, ఇతర సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ క్రమంలో సమస్యాత్మకమండలాలను తక్షణమే గుర్తించి రక్షణ కల్పించాలని కల్పించాలని కలెక్టర్ ఏ మల్లికార్జునకు, పోలీసు కమిషనర్ ఏ రవిశంకర్‌కు వినతి పత్రాలను సమర్పించారు. పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


సమస్యలపై కలెక్టర్‌కు వినతి ప త్రమిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

నాసా పోటీలకు ఎంపిక

సీతమ్మధార, ఫిబ్రవరి 14 : నేషనల్ ఎరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) పోటీలకు రవీంద్ర భారతి పాఠశాల ఎంపికైనట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ విద్యాసంస్థల చైర్మన్ ఎంఎస్ మణి తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని తమ పాఠశాలలకు చెందిన చిన్నారులు రూపొందించిన కృతిమ మేథ, పృథ్వీ, ఆర్ ఎర్త్ తదితర 14 ప్రాజెక్టులు ఎంపికైనట్టు ఆయన చెప్పారు. లాస్ ఏంజెల్స్‌లో మే నెల 23 నుంచి 26వ తేదీ వరకూ జరిగే అంతర్జాతీయ సమ్మేళనంలో ఈ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారన్నారు. విద్యార్థులను పాఠశాల నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకేష్, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు

'వాడబలిజలకు టికెట్లు ఇవ్వాలి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 14: మత్స్యకార వాడ బలిజ కులస్తులకు రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధి మాద మహేష్ కోరారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా వాడ బలిజ కులస్తులు అధికంగా ఉన్నా విశాఖ దక్షిణ, పలాస నియోజకవర్గాల్లో త మకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో టికెట్లు ఇస్తే తమ వారిని గెలిపిస్తామన్నారు. ఉత్తరాంధ్ర మత్స్యకార ప్రతినిధి ఉమ్మిడి అప్పారావు మాట్లాడుతూ మత్స్యకారులను ఆదరించిన రాజకీయ పార్టీలకు వాడబలిజ కులస్తుల మద్దతు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మత్స్యకార ప్రతినిధులు కందుల పైడిరాజు, గరికిన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మత్స్యకార వాడ బలిజ ఐక్యవేదిక ప్రతినిధులు

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నీ


విజేతలతో అతిథి డాక్టర్ శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 14: జిల్లాస్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ బుధవారం ముగిసింది. సాగర్‌నగర్‌లోని టీటీ అకాడమీలో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర టే బుల్ టెన్నిస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ ముఖ్య అతిథిగా విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. టోర్నీ నిర్వాహకులు ఎస్.రామారావు, పి.శ్రీనివాసరావు, వి.ధనరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: అండర్-11 బాలుర విభాగంలో ఆర్యన్, సహిత్, బాలికల విభాగంలో పూజిత, జశ్మిత; అం డర్-13 బాలుర విభాగంలో మోక్ష, బాలాజీ, బాలికల కేటగిరిలో ఎస్‌కే అరిఫా, సెవిత శ్రీ; అండర్-15 బాలుర విభాగంలో టి.సాయిచరణ్, జాషువా, బాలికల కేటగిరిలో డి.దీక్షిత, జోస్నా విజయం సాధించారు. అండర్-19 బాలుర విభాగంలో మణికుమార్, మహిధర్, బాలికల కేటగిరిలో సన్విక, బి.జశ్మిత విన్నర్, రన్నరప్‌గా నిలిచారు.

సెంచరి క్లబ్‌పై ఆరోపణలు అవాస్తం

- క్లబ్ మాజీ అధ్యక్షుడు దిలీప్ కుమార్

మహారాణిపేట, ఫిబ్రవరి 14: సెంచరి క్లబ్‌పై సస్పెండయిన మాజీ సభ్యుడు శివాజీ చేసిన ఆరోపణలు అవాస్తవమని, అతనిని తొలగించామనే కక్ష్యతోనే ఇలా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఐబీపీ సెంచరి క్లబ్ సభ్యుడు, మాజీ అధ్యక్షుడు దిలీప్ కుమార్ తెలిపారు. బుధవారం మహారాణిపేటలోని క్లబ్ ఆవరణలో సంస్థ సభ్యులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంచరి క్లబ్ దక్షిణ దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన సంస్థ అని, దీనిని 1933లో ఏర్పాటు చేసి, సుమారు 90 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్నదన్నారు. ఎప్పుడూ ఏ విధమైన ఆరోపణలు లేవని, అనేక ఏళ్లగా నగరంలోని ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు రాజకీయ నాయకులు, ప్రముఖులు క్లబ్‌లో సభ్యులుగా ఉంటున్నారన్నారు. కె. శివాజీ, పి.వెంకటరమణలు ఇద్దరూ... క్రమ శిక్షణా రాహిత్యానికి పాల్పడటంతో సభ్యత్వాలను రద్దు చేశామని తెలిపారు. సమావేశంలో అధ్యక్షుడు వై. దుర్గాప్రసాద్, కార్యదర్శి జవహర్‌లాల్, పి. వెంకటరాజు, శ్రీమాన్ రామచంద్ర, మనోహర్, అనీల్‌బాబు, కిశోర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్లబ్ ప్రతినిధులు

ఉచిత వైద్య శిబిరం

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 14: వన్‌టౌన్‌లోని చిలపేట, పద్మానగర్ ప్రాంతవాసులకుశెట్టి బలిజ క మ్యూనిటీ హాలులో వేదాంత గూడ్స్ కార్గో, ఎఫ్ఎక్స్‌బీ ఇండియా సురక్ష సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచితవైద్యశిబిరం నిర్వహించారు.వైద్య నిపుణులు 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులందజేశారు.వేదాంత సంస్థ సీఎఆర్ఎస్ మేనేజర్ సీఎస్ లక్ష్మి, ఎఫ్ఎక్స్‌బి సురక్ష ప్రాజెక్టు మేనేజర్ వై.అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. వైసీపీ నాయకురాలు కొల్లి సింహాచలం, కమ్యూనిటీ మొబలైజర్ జి.సునీత,డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.


వైద్య పరీక్షలుచేస్తున్న దృశ్యం

ట్రయథ్లాన్‌లో వంశీ కిరణ్‌కు కాంస్యం

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 14: ఇండియన్ నేవీ సర్వీసెస్ నిర్వహించిన జాతీయ స్థాయి ట్రయథ్లాన్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థి కాంస్య పతకం సాధించాడు. లోనవాలలో జరిగిన ఈ టోర్నీలో ట్రయిథ్లాన్ ఈవెంట్‌కు సంబంధించి ఒక కి.మి. స్విమ్మింగ్, 30 కి.మి. సైక్లింగ్, 10 కి.మీ రన్నింగ్‌లో వంశీ కృష్ణ ఈ పతకం సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కాలేజీ కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ వంశీకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణ రెడ్డి, గంగా భవాని పాల్గొని వంశీకృష్ణ ప్రతిభను కొనియాడారు.


వంశీని అభినందిస్తున్న ప్రతినిధులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ రైల్వే కాలనీలలోని చిల్డ్రన్స్ పార్కులో పూలు, పండ్ల మొక్కలను నాటారు. అక్కడి నివాసితులతో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పరిసరాల్లో మొక్కలు నాటాలని కోరారు. ప్రత్యేక అతిథిగా హాజరైన డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ కార్య క్రమాలను చేపడుతున్న ఈకార్వో ప్రతినిధులను ఈసందర్భంగా అభినందించారు. ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ఈకార్వో ప్రతినిధులు మధుమిత సాహు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న డీఆర్ఎం

గిరిజన గ్రామాల్లో వసతులు కల్పించాలి

- జడ్పీ ఆవరణలో గిరిజనులు వినూత్న నిరసన


డోలీ మోత, ఖాళీ పాత్రలతో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

మహారాణిపేట, ఫిబ్రవరి 14: గిరిజన గ్రామాలకు సాగు, తాగునీరు, కరెంటు, రహదారులు తదితర వసతులు కల్పించాలని కోరుతూ గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. జడ్పీకార్యాలయ ఆవరణలో బుధవా రం ఆదివాసీలు అడ్డాకులు ధరించి, కాగడాలు, డోలీ మోతలతో తమ నిరసనను వ్యక్తంచేశారు. అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ పరిధి బూరె, చినకోనల తదితర గ్రామాలకు రోడ్డు, కరెంటు సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోయారు. తమ భూములను స్థానిక రెవెన్యూ అధికారులు రియల్‌ఎస్టేట్ వ్యాపా రులతో కుమ్మక్కై గిరిజనేతరులకు నమోదు చేస్తున్నారని ఆ రోపించారు. తమ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెదకోట, పినకోట కివర్ల పంచాయతీ పరిధి 12 గిరిజన గ్రామాల ప్రజలు శ్రమదానంతో 13 కిలో మీటర్ల మేర రహదారి నిర్మించుకున్నట్టు చెప్పారు. ఆ గిరిజన ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు , కరెంటు సౌకర్యం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు యువకులు పాల్గొన్నారు.

'ఉత్తరం' ఇన్‌చార్జిగా 'పాలమరశెట్టి'ని నియమించాలి

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 14 : ఉత్తర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పార్టీ సీనియర్ నాయకుడు పొలమరశెట్టి శ్రీనివాస్‌ను నియమించాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును ఆయా వార్డుల అధ్యక్షులు, నాయకులు కోరారు. ఈ మేరకు గంటాకు బుధవారం నార్త్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, వార్డు అధ్యక్షులు కార్తీక్ కుట్టా, పొలమరశెట్టి శ్రీనివాస్, నాయకులు సంగువాను, గారపాటి సతీష్ ఉన్నారు.

పలు రైళ్లు రద్దు...దారి మళ్లింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను మళ్లింపు మార్గం నడిపించనున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈనెల 26 నుంచి మార్చి 31 వరకు మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), కాకినాడ-విశాఖ పాసింజర్ (17269), విశాఖ-కాకినాడ పాసింజర్ (17268), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) రద్దు. అలాగే ఈనెల 27 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) రద్దు.

దారి మళ్లింపు

ఈనెల 26, 28, మార్చి 1, 2, 4, 6, 8, 9, 11, 13, 15, 16, 18, 20, 22, 23, 25, 27, 29, 30న ముంబాయి-కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), ఈనెల 26, మార్చి 4, 11, 18, 25న ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643), ఈనెల 28, మార్చి 1, 6, 8, 13, 15, 20, 22, 27, 29న బెంగుళూరు-గుహవటి ఎక్స్‌ప్రెస్ (12509) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి. ఇక ఈనెల 26, 31న ధనబాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351), ఈనెల 29, మార్చి 7, 14, 21, 28న టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111), ఈనెల 28, మార్చి 6, 13, 20, 27న జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376), ఈనెల 26, మార్చి 4, 11, 18, 25న హటియా-ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ (22837), మార్చి 2, 9, 16, 23, 30న హటియా-ఎంఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (18637), ఈనెల 27, మార్చి 3, 5, 10, 12, 17, 19, 24, 31న హటియా-ఎంఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835), మార్చి 1, 8, 15, 22, 29న టాటానగర్-ఎస్ఎంవీ బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (12889) రైళ్లు వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి.

అమర్‌కు అవకాశం దక్కేనా?

... 5వ పేజీ తరువాయి

మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కూడా ప్రయత్నిస్తున్నారు.

నా గురించి జగన్ చూసుకుంటారు

టికెట్‌పై ఒకటి, రెండుసార్లు మంత్రి వద్ద విలేకరులు ప్రస్తావించగా...తన గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని సీఎం జగన్ చూసుకుంటారని, ఆయన ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని, లేదంటే పార్టీ కోసం పనిచేస్తానని, దేనికైనా సిద్ధమేనని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో వారం కిందట అమర్‌ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పార్టీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఆయనకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుందో, లేదో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

జల జీవన్ మిషన్ పనుల్లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

సీఈవో ఎం.పోలినాయుడు జోక్యం చేసుకని జల జీవన్ మిషన్ పనుల వివరాలను గ్రామాల వారీగా బోర్డులు ఏర్పాటుచేసి ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఆరు నెలలుగా జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు అందడం లేదని చింతపల్లి సభ్యుడు పోతురాజు బాలయ్య ఆవేదన వ్యక్తంచేయగా...గత ఏడాది జూలై, ఆగస్టు నెలల బిల్లులు అప్‌లోడ్ చేశామని, ఆ తరువాత నెలల బిల్లులు ఇంకా మంజూరు కాలేదని సీఈవో తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖపై పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు నిర్వహించిన రోగులకు కళ్లద్దాలు పంపిణీ పూర్తిగా జరగలేదని ప్రస్తావించగా అనకాపల్లి డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్ బదులిస్తూ దశల వారీగా అందజేస్తామన్నారు. మునగపాక జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సోమసత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించేందుకు లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించగా అందులో వాస్తవాలు ఉన్నాయని బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు పేర్కొనడంతో...చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేయగా, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటు, పాముకాటుకు వ్యాక్సిన్ వేయడానికి సూదులు కొరత ఉందని జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ పేర్కొన్నారు.

చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కొయ్యూరు, అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు వారా నూకరాజు, దేశరి గంగరాజు మాట్లాడుతూ కొందరు వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని ఫిర్యాదు చేశారు. అనంతగిరి నుంచి రోగులకు అత్యవసర వైద్యం కోసం నేరుగా విశాఖకు తీసుకురావడానికి అంబులెన్స్ ఇవ్వడం లేదని గంగరాజు ఆరోపించగా, సమస్యను పరిష్కస్తామని 108 కో-ఆర్డినేటర్ హామీ ఇచ్చారు. కొయ్యూరు మండలాధ్యక్షుడు బి.రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో డయాలసిస్ రోగులకు వైద్యం అందుబాటులో లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కొయ్యూరు నుంచి నర్సీపట్నం ఆస్పత్రికి వస్తే రిజిస్టర్ చేసుకున్న 25 రోజుల తరువాత డయాలసిస్ చేస్తున్నారన్నారు. ఆయనతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఇతర సభ్యులు ఏకీభవిస్తూ ఏజెన్సీలోని చింతపల్లి, అరకులోయ ఆస్పత్రుల్లో డయాలసిస్ సదుపాయం కల్పించాలని అధికారులను కోరారు. ఏజెన్సీలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, సకాలంలో వైద్యం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం ఆందోళన వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు తక్షణ సేవలు అందించే యంత్రాంగం ఏర్పాటుచేయాలన్నారు. దీనికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందిస్తూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు అంబులెన్స్ సిబ్బంది కొంత వరకు ప్రాథమిక చికిత్స చేస్తారని, తీవ్రంగా గాయపడితే వెంటనే ఆస్పత్రిలో చేర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏజెన్సీకి చెందిన పలువురు జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ ప్రమాదాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్, అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టికెట్ల కోసం కాంగ్రెస్‌లో పోటీ

... 5వ పేజీ తరువాయి

తదితరులు ఉన్నారు. ఇక తూర్పు నియోజకవర్గం టికెట్ కోసం ఎనిమిది మంది, 'పశ్చిమ' సీటు కోసం పది మంది, 'ఉత్తరం' కోసం పది మంది, 'గాజువాక'కు పది మంది, 'భీమిలి'కి 12 మంది, దక్షిణ నియోజకవర్గం నుంచి ఎనిమిది, ఎస్.కోట నుంచి పది మంది దరఖాస్తు చేసుకున్నారు. విశాఖ పార్లమెంటు, దాని పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు మొత్తం 80 దరఖాస్తులు అందాయి. ఈ నెల 29 వరకు గడువు ఉండడంతో ఈ సంఖ్య వంద దాటుతుందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 14: విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. తోటగరువు, హనుమంతవాక కూడలి, కొండవాలు ప్రాంతం, బీబీఎన్ఆర్ నగర్, విశాలాక్షినగర్, కైలాసగిరి రోడ్డు, రెవెన్యూకాలనీ తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంవీపీ కాలనీ పరిధిలో రేపు ...

ఎంవీపీ కాలనీ: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్ 1 ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ ఆరో సెక్టరు పరిధిలోని కొన్ని ప్రాంతాలతో పాటు అంజయ్యకాలనీ, రాజీవ్ పార్కు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'జిమ్‌సర్ సేవలు అభినందనీయం'

మధురవాడ, ఫిబ్రవరి 14: గీతం వైద్యకళాశాల నిర్వాహకులు పేదలకు ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. బుధవారం జీవీఎంసీ 7 వ వార్డు చంద్రంపాలెంలో గీతం వైద్యకళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యనిపుణులు పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకటరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, వార్డు ప్రధాన కార్యదర్శి కానూరి అచ్చుతరావు, వార్డు యూనిట్ ఇన్‌చార్జి నాగోతి సూర్యప్రకాశరావు, పోతిన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అనంతవరం' భూముల కౌలు వేలం రేపు

పద్మనాభం, ఫిబ్రవరి 14: మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన నారాయణేశ్వరస్వామి, రామాలయాల భూములు కౌలుకు ఇవ్వడానికి ఈనెల 16న ఉదయం 11.30కు స్థానిక సచివాలయ ఆవరణలో టెండరు కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు పద్మనాభం గ్రూపు ఆలయాల ఈఓ ఎస్ . నానాజీబాబు తెలిపారు. వీటిలో నారాయణేశ్వర ఆలయానికి చెందిన 9.97 ఎకరాలు, రామాలయానికి 3.45 ఎకరాల విస్తీర్ణం భూమి సాగుకు 2024 ఏప్రిల్1 నుంచి 2027 మార్చి 31 వరకు కౌలుకు ఈవేలం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ప్రతికి రూ. వె య్యి ప్రథమ ధరావతుగా చెల్లించాలన్నారు.ఈవేలంలో రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఫిబ్రవరి 14: వరాహలక్ష్మీనృసింహ స్వామికి బుధవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా తొలుత ఉత్స వ మూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి భక్తుల గోత్రనామాలతో శ్రీకారం చట్టి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం ఉభయ దేవేరులతో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి ఆగమ శాస్త్రోక్తముగా ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. సేవల్లో పాల్గొన్న భక్తులకు నిబంధనల మేరకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

24 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 14: కొత్త వెంకోజీపాలెం శ్రీ గణేష్ సాయి షటిల్ అండ్ బ్యాడ్మింటన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 , 25 తేదీల్లో ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వేగి రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కొత్త వెంకోజీపాలెం వుడా కల్యాణమండపం ఎదురుగా ఉన్న జీవీఎంసీ హరితవనం పార్కులో సాయంత్రం 5.30 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పాల్గొనదలచిన వారు 9246748640 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరేష్ కుమార్, దాడి ఈశ్వరరావు, ఆడారి శ్రీనివాసరావు, మద్దాల శివానందం, ఆడారి సత్యనారాయణ, పీల కనకరాజు, ఆడారి కామేష్, పిల్ల ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లలిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్ :** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజ బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 19, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 44, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 24, దొండకాయలు 34, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోస కాయలు 26, వె ల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..



అప్పన్న సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



అష్టలక్ష్మీదేవాలయంలో చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం

వైభవంగా వసంత పంచమి పూజలు

» ఆలయాల్లో సందడిగా అక్షరాభ్యాసాలు

సింహాచలం, ఫిబ్రవరి 14: వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. ఇందులో భాగంగా వ్రతమండపంలో లక్ష్మీనారాయణుల సన్నిధిలో భక్తుల గోత్రనామాలతో సంకల్పించి ముందుగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు జరిపించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం చిన్నారులతో వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య బియ్యంలో, తరువాత కొత్త పలకపై బలపంతో అక్షరాలను దిద్దించారు. సర్వతోముఖాభివృద్ధి చెందాలంటూ అర్చకులు చిన్నారులను దీవించారు. సరస్వతిమాత చదువుల తల్లి జయంతి సందర్భంగా సింహాచలం దేవస్థానానికి చెందిన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాను సారధ్యంలో విద్యార్థులు ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి పూజలు చేశారు.

తగరపువలసలో...

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేళ్లు నిండిన చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేశ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి దేవాలయంలో...



సంపత్ వినాయగర్ ఆలయంలో అక్షరాభ్యాసాలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో బుధవారం వంద మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించినట్టు అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ఈ సందర్భంగా విద్యాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తల్లితండ్రులు పాల్గొన్నారు. ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చంద్రంపాలెం జాతరగుట్ట అమ్మవారి ఆలయంలో వసంతపంచమి సందర్భంగా చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు పిళ్లాసూరిబాబు, నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో...

వెంకోజీపాలెం: వసంత పంచమి సందర్భంగా పలు పాఠశాలల్లో బుధవారం విద్యార్థులతో ప్రత్యేకంగా సరస్వతి దేవి పూజలు నిర్వహించారు. వేద మంత్రాలతో సరస్వతి దేవికి అభిషేకాలు జరిపారు. ఇసుకతోటలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్, హెచ్‌బీకాలనీ శ్రీ శారదా విద్యానిలయంలో విద్యార్థులతో పూజలు చేయించారు. నూతన విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు లేకుండా ప్రవేశాలను కల్పించారు.

బీవీకే పాఠశాలలో...

విశాలాక్షినగర్: స్థానిక బీవీకే పాఠశాల ప్రాంగణంలో బుధవారం సరస్వతీ హోమం నిర్వహించారు. సుమారు 52 మంది తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి వీఆర్ సత్యనారాయణ, హెచ్ఎం కేవీడీ మాధురి తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ ఆలయంలో...

సిరిపురం: వసంత పంచమి పురస్కరించుకుని శ్రీ సంపత్ వినాయగర్ ఆలయంలో బుధవారం అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించినట్టు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు టీఆర్.చోళన్ తెలియజేశారు. సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పిల్లలతో ఆలయ పురోహితులు అక్షరాభ్యాసం చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సింహాచలంలో సరస్వతీదేవికి విద్యార్థుల పూజలు



బీవీకే పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం



సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న చిన్నారులు

ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సిద్ధం కావాలి

» బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ కేసలి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ అప్పారావు

ఆరిలోవ, ఫిబ్రవరి 14: విద్యార్థులు ఆత్మ స్థైర్యంతో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ కేసలి అప్పారావు, కౌన్సిల్ సభ్యుడు గొండు సీతారం సూచించారు. శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్, ఐసీపీఎస్‌ల సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పరీక్షలకు ముందు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకూడదన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నిపుణులు, సైకాలజిస్టులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పరీక్షలు భూతం కాదని, మీరు చదువుకున్న అంశాలపై వచ్చే ప్రశ్నలేనని, వాటికి సమాధానాలు రాయడమేనని వివరించారు. ప్రతిరోజూ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగే ప్రక్రియేనని తెలిపారు. నిరాస, నిస్పృహలకు గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రతి విద్యార్థీ తాను గొప్పవాడినని, పరీక్షలు బాగా రాయగలను అని అనుకుంటే ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నవల్లి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

భోజన, వసతి పరిశీలించిన ఏయూ రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 14: ఏయూ రీసెర్చ్‌స్కాలర్స్ మెస్‌ని రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్ బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన సమయంలో మెస్‌ని తనిఖీ చేసి పరిశోధకులతో మాట్లాడారు. నాణ్యత తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడారు. పరిసరాలు, కిచెన్‌లను పరిశీలించారు. నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. వార్డెన్లు, చీఫ్ వార్డెన్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. చీఫ్ వార్డెన్ బి.మునిస్వామి, జి.వీర్రాజు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవో భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ సభ్యులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల, కార్మికులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల సమస్యలను తక్షణం ప్రభుత్వం పరిష్కరించాలని జేఏసీ ప్రతినిధులు డిమాండ్‌చేశారు. ఈమేరకు బుధవారం ఆర్డీవో ఎస్.భాస్కర్ రెడ్డికి వినతిని అందించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి ఉద్యోగీ సమస్యలతో సతమతమవుతున్నాడన్నారు. గత ఏడాది జూలై నుంచి 12వ పీఆర్‌సీ అమలు చేయాల్సిఉందన్నారు. పెరిగిన ధరలతో ఇబ్బంది ఎదుర్కొంటున్నామన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినా ఏన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 11వ పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించలేదన్నారు. దీంతో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు భీమిలి తాలూకా కేంద్రంలో జేఏసీ సభ్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు కాళ్ల సాయిబాబు, కె.ముత్యాలరావు, టి.భీమారావు, ఎం.ఆనందరావు, వి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరంగా కోలాటం

సింహాచలం, ఫిబ్రవరి 14: అనకాపల్లి జిల్లా రాంబిల్లికి చెందిన బంగారుతల్లి బృందం కోలాటం భక్తులను అలరించింది. దేవతా మూర్తులపై పాటలను ఆలపిస్తూ లయబద్ధంగా మహిళలు, యువతులు, చిన్నారులు నర్తించారు. ఓ చిన్నారి ఈ కోలాటంలో పాల్గొని మరింత సందడి చేసింది.



అప్పన్న సన్నిధిలో కోలాటం ఆడుతున్న దృశ్యం

ప్రపంచ దేశాల ప్రగతికి మానసిక శాస్త్రం దోహదం

» ఐయూపీఎస్ సెక్రటరీ జనరల్ అవాడి థామ్సన్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 14: ప్రపంచ దేశాల ప్రగతికి మానసిక శాస్త్రం దోహదపడుతోందని, అందుకే దీని ప్రాధాన్యతను యునెస్కో సహితం గుర్తించినట్టు ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సైకలాజికల్ సైన్స్ (ఐయూపీఎస్) సెక్రటరీ జనరల్ అవాడి.థామ్సన్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న నేషనల్ అ కాడమి ఆఫ్ సైకాలజీ (ఎన్ఏపీ) 33వ వార్షిక సమావేశాలను ఆమె బుధవారం ప్రారంభించారు. మానసిక శాస్త్రంలో నూతన అంశాలను చేర్చడానికి వివిధ దేశాలలోని మానసిక శాస్త్ర పరిశోధకులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దయానందసిద్ధ



సమావేశాలను ప్రారంభిస్తున్న అవాడి థామ్సన్

పట్టం, నేషనల్ అకాడమి ఆఫ్ సైకాలజీ అధ్యక్షులు ప్రొఫెసర్ నీనా కొహ్లి మాట్లాడారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రేటర్ నాలుగో వార్డు పరిధిలో ఇప్పటివరకు సుమారు రూ.150 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు ఆయన వివరించారు. కాపులుప్పాడలో రూ.1.27 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. భీమిలి జోన్‌లో విలీన గ్రామాలతో ఉన్న 4వ వార్డులో మౌలిక వసతులను కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు చొరవతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చేపలుప్పాడ సచివాలయం పరిధిలో ఎస్సీ కాలనీ కొత్తూరులో, కెనగరపాలెం న్యూ ఎస్సీ కాలనీలో, సీసీ రోడ్లు, కాలువలు, నరసింహనగర్‌లో సామాజిక భవనం నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి జోనల్ కమిషనరు శైలజ వల్లి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తగరపువలస: చిట్టివలస జూట్‌మిల్లు కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించకుండా తాత్సారం చేస్తోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. న్యాయం చేయాలని



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కోరుతూ బుధవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టికి వినతిపత్రం అందించారు. బకాయిలు చెల్లింపు చేయడంలేదని, మారుపేరు కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. దీంతో ఎమ్మెల్యే యాజమాన్య ప్రతినిధి బజోరియాతో ఫోన్‌లో మాట్లాడారు. గురువారం క్యాంప్ ఆఫీసులో నిర్వహించే సమావేశానికి అన్ని వివరాలతో రావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశానికి అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్మిక శాఖ అధికారులను ఆహ్వానించామన్నారు వినతిపత్రం అందించిన వారిలో ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ సంఘాల నాయకులున్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ శంకుస్థాపన



గెడ్డల ఆధునికీకరణకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ, ఫిబ్రవరి 14: జీవీఎంసీ 13వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ వార్డులో సుమారు రూ.1.47 కోట్లతో గెడ్డల ఆధునికీకరణ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటరావు, కెల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏయూలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ ప్రారంభం



ల్యాబొరేటరీని ప్రారంభిస్తున్న మేయర్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 14: ఫుడ్ ప్రొసెసింగ్ సొసైటీ తోడ్పాటుతో ఏయూలో ఫుడ్ టెస్టింగ్, స్టాండడైజేషన్ ల్యాబొరేటరీ ప్రారంభమైంది. అగ్రికల్చర్, కోఆ పరేషన్, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ల్యాబ్‌ను ప్రారంభించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ల్యాబ్ సేవలు అందిస్తుందన్నారు. తొలిదశలో రూ.10 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని, ప్రయోగశాలకు అధునాతన పరికరాలను కొనుగోలు చేశామన్నారు. మొత్తం రూ.18 కోట్లు అంచనా వ్యయంతో మెగా ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతామని వీసీ ప్రసాదరెడ్డి తెలిపారు. కొద్దిరోజుల క్రితం మైలాన్ ల్యాబొరేటరీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.8 కోట్లు అందించడానికి సంసిద్ధత తెలిపిందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పనిచేస్తున్న సంస్థలు తమ ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించడానికి, ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి అవసరమైన టెస్టింగ్, సర్టిఫికేషన్ వ్యవస్థగా ల్యాబొరేటరీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి రాజధాని పేరిట వైసీపీ కొత్త నాటకం

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

భీమునిపట్నం, ఫిబ్రవరి 14: విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించిన వైసీపీ నేతలు కొత్తగా హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కావాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి వచ్చిన వారంరోజులకే మూడు రాజధానులని మభ్యపెడుతూ వచ్చిందన్నారు. అనంతరం వైజాగ్ పరిపాలనా రాజధాని అంటూ అనేక మలుపు తిప్పుతూ మోసగిస్తోందని మండిపడ్డారు. అమరావతిని సర్వనాశనం చేసి, ఎన్నికల వేళ మరోసారి ప్రజలను మభ్యపెట్టడానికి హైదరాబాద్‌ను తీసుకువస్తున్నారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆస్తులను కేసీఆర్‌కు అప్పనంగా రాసిచ్చేశారని విమర్శించారు. ఈ మోసాలను ప్రజలు గుర్తిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో గద్దె దింపేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రానికి అమరావతే రాజధానని, అది తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలోనే జరుగుతుందన్నారు.

తెలగ కులస్థులను బీసీల్లో చేర్చాలి

» ఉత్తరాంధ్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లంట్ల రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లంట్ల రామారావు

పద్మనాభం, ఫిబ్రవరి 14: తెలగ కులస్థులను బీసీలలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లంట్ల రామారావు చేస్తున్న పాదయాత్రకు మండలంలో స్థానిక నాయకులు సంఘీభావం తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు సాగుతున్న ఈ పాదయాత్రకు బుధవారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా స్థానిక జెడ్పీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సభలో రామారావు మాట్లాడుతూ 1962 వరకు బీసీలలో ఉన్న తెలగ కులస్తులను గత ప్రభుత్వాలు ఓసీలలో చేర్చి తమకు తీరని అన్యాయం చేశాయన్నారు. తమ కులాన్ని తిరిగి బీసీలలో చేర్చాలని ఈపాద యాత్ర చేస్తున్నామన్నారు. ఈనెల 25న భోగాపురంలో 3లక్షల మందితో సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ కులాని కి సానుకూలంగా ఉన్న పార్టీకే రానున్న ఎన్నికలలో తమ మ ద్దతు తెలుపుతామన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైఎస్ చైర్మన్ గిరిబాబు, సర్పంచ్ పల్లంటి చిన్నారావు, నాయకులు ఆదిబాబు, అప్పలరాజు, జగదీష్‌బాబు, మురళి, సీతారాము తదితరులు పాల్గొన్నారు.